కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం



హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక డి.లిట్ లభించింది. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేష సేవలందించినందుకు, అకాడమీని అభివృద్ధి పథంలో నడిపినందుకు గాను ఈ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు మహేంద్రకర్మ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ జగదల్పూరులోని ఈ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం చేశారు.

అన్ని పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలని, లేదంటే ఆ పార్టీల భరతం పడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనగణనలో కులాల వారీగా బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం గత బడ్జెట్‌లో 2 వేలా 150 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. 75 కోట్ల బీసీ జనాభాకు ఆ నిధులు ఏ మూలకు సరిపోవని అన్నారు. దేశంలో బీసీ యువజన సంఘాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, యూపీ, బిహార్ రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేశామని మిగతా రాష్ట్రాల కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, రామకృష్ణ, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

మాదిగలకు మూడు ఎంపీ స్థానాలను కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ యువసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. యువసేన రాష్ట్ర కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరి మాదిగ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాపయ్య మాట్లాడూతూ ఎంపీ స్థానాల సాధనకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పులిజాల గెల్వయ్య, యాదయ్య, మేడి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: యాదస్వామి

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు యాదస్వామి సీఎంను కోరారు. రాష్ట్రంలో గత 30ఏళ్లలో 9సార్లు జరిగిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఒక్కసారి కూడా క్రాఫ్ట్ టీచర్ లేదా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లోనైనా క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించి, నిరుద్యోగ క్రాఫ్ట్ టీచర్లను ఆదుకోవాలని సీఎంకు ప్రజాభవన్‌లో విజ్ఞప్తి చేశారు.

మహా శివరాత్రి సందర్భంగా...

ఏడుపాయలకు 113 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్. మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజియన్ సీబీఎస్ నుంచి ఏడుపాయలకు 113 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 7 నుంచి 11వతేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు. 7వ తేదీన 8 బస్సులు, 8న 20 బస్సులు, 9న 40 బస్సులు, 10న 40 బస్సులు, 11న 5 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఏడుపాయలకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షా ఫలితాలు విడుదల

- 7వ తేదీలోగా రీ వాల్యుయేషన్‌కు అవకాశం

కుషాయిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి బోర్డు (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో గత జనవరిలో నిర్వహించిన టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. అభ్యర్థులు ఎస్‌బీటీఈటీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేవిధంగా రీ వాల్యుయేషన్, ఆన్సర్ షీట్ కాపీలు కావాల్సిన వారు ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాధానపత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీ వాల్యుయేషన్ కోసం సబ్జెక్టుకు రూ.750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కాగా, జూన్‌లో నిర్వహించే టైప్ రైటింగ్/షార్ట్‌హ్యాండ్ పరీక్షల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

అర్ధరాత్రి తర్వాత తీవ్ర శబ్దకాలుష్యంపై పిటిషన్

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తాడ్‌బండ్ ప్రాంతంలో బంటియా గార్డెన్స్, ఇంపీరియల్ గార్డెన్స్ ఫంక్షన్ హాళ్ల ద్వారా అర్ధరాత్రి 12 తర్వాత కూడా తీవ్రమైన శబ్దకాలుష్యం జరుగుతోందని మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్‌కు చెందిన అడిషనల్ చీఫ్ ఇంజినీర్ జే సతీశ్ భరద్వాజ హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఈ వ్యవహారంపై వివరాలు తెలియజేయాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌కు మంగళవారం ఆదేశాలు జారీచేసింది. అలాగే ఈ పిటిషన్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును ఇంప్లీడ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. కేవలం రూ.10 వేలు జరిమానా వేసి వదిలేస్తే పరిస్థితులు ఏమీ మారవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శబ్దకాలుష్య నియంత్రణకు 2010లో జారీచేసిన జీవో నం.170 నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని.. పదోతరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా వేసింది.

వాటర్‌ప్లాంట్ల జలచౌర్యంపై పిటిషన్..

ప్రభుత్వ అండర్‌గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ నుంచి వాటర్‌ప్లాంట్ యజమానులు నీటిని చోరీ చేస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాచిగూడ శ్మశానవాటిక వద్ద శిల్పా వాటర్‌ప్లాంట్ యజమానులు ప్రభుత్వ పైప్‌లైన్ నుంచి నీటిని చోరీచేస్తున్నారని ఉస్మాన్‌గంజ్‌కు చెందిన మొహమ్మద్ సల్మాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి రిజిస్ట్రీ నంబర్ ఇవ్వకపోవడంతో రెగ్యులర్ నంబర్ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. వాటర్‌ప్లాంట్ యజమానులు సహా మున్సిపల్, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల, పోలీసుశాఖలు, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.



మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్‌లో 'మైండ్‌స్పేస్ పవర్‌టాక్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

13,567 మందికి పోలియో చుక్కల మందు

ముషీరాబాద్‌లో రెండు రోజుల్లో 90శాతం పూర్తి



రాంనగర్‌లో ఇంటింటి సర్వేచేస్తున్న డబ్ల్యూహెచ్‌వో టీమ్, వైద్యులు

ముషీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పోలియోరహిత సమాజ స్థాపన కోసం రెండు రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమానికి ముషీరాబాద్ నియోజకవర్గంలో విశేష స్పందన లభించింది. మొదటిరోజు ప్రధాన కేంద్రాలు, మంగళవారం ఇంటింటికీ వెళ్లి అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ రెండు రోజుల్లో 13,567 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వైద్యులు తెలిపారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో 2961 మంది చిన్నారులకు, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలో 5287 మంది చిన్నారులకు, రంగానగర్‌లోని బైబిల్‌హౌస్ యూపీహెచ్‌సీపరిధిలో 5319 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఇప్పటివరకు ఆయా ఆస్పత్రుల పరిధుల్లో చుక్కల మందు పంపిణీ 90 శాతం పూర్తి అయినట్లు వైద్యాధికారులు తెలిపారు.

డబ్ల్యూహెచ్‌వో టీమ్ సర్వే

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) బృందాలు మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో సర్వే చేశారు. చిన్నారులకు చుక్కల మందు వేయించారా లేదా అని చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వచ్చి చిన్నారులను గుర్తించారా అని, చుక్కల మందు వేయించని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారా అని అడిగారు. ఆస్పత్రులలో వైద్యాధికారులను కలిసి ఇప్పటివరకు ఎంత మంది చిన్నారులకు చుక్కల మందు వేయించారని తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు.

90శాతం పూర్తి చేశాం



పల్స్‌పోలియో కార్యక్రమంలో రెండు రోజుల్లో తమ ఆస్పత్రి పరిధిలో 90 శాతం చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశాం. ఇప్పటికీ వేసుకోని చిన్నారుల కోసం బుధవారం సైతం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చుక్కల మందు వేస్తారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ దీప్తి ప్రియాంక, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

పెట్టుబడులు, రాబడులపై అవగాహన

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదల తీరు, దానివల్ల రూపాయి విలువలో వచ్చే తరుగుదల, దీనిని తట్టుకుని నిలబడడానికి వివిధ రకాల పెట్టుబడుల ఆవశ్యకతను ప్రముఖ ప్రొఫెషనల్ బ్యాంకర్ అయిన ఆర్.శ్రీకృష్ణన్ తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్‌లో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కొచ్చిలోని ఫిన్ ఎడ్యు కనెక్ట్ సంస్థ సహకారంతో ఫైనాన్షియల్ వెల్నెస్ ఆఫ్ ఉమెన్ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వివిధ సంస్థల పనితీరు మొదలైన అంశాలపై వివరించారు.



ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో మహిళలు

ఫొటోగ్రఫీపై మహిళలకు వర్క్‌షాప్

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా విభాగంతో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జయచంద్ర ఫొటోగ్రఫీ అధినేత స్టిల్ కెమెరామెన్ శ్రీధర్ భూశెట్టి మహిళలకు ఫొటోగ్రఫీపై వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె.హుస్సేన్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి శైలేందర్, సహాయ కార్యదర్శి వై.లక్ష్మారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎల్.జయమాధురి, కార్యదర్శి తులసి, కోశాధికారి విజయలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్: శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

'జయరాజ్ కెనెడీని పదవి నుంచి తొలగించాలి'

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో 10 ఏళ్లకు పైగా ఒకే పోస్టులో తిష్టవేసి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఫైనాన్స్ విభాగం అడిషనల్ కమిషనర్ జయరాజ్ కెనెడీని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి నాగు నాగేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వారు ఫిర్యాదు చేశారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, ఎన్నికల కమిషనర్‌లు వెంటనే జయరాజ్‌కెనెడీని పదవి నుంచి తొలగించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దూషించిన వ్యక్తికి 10 రోజుల జైలు

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిని అసభ్యపదజాలంతో దూషించి గాయపరిచిన వ్యక్తిని దోమలగూడ పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. దోమలగూడలోని సాయివాణి ఆస్పత్రి సమీపంలో అభిలాష్(22) మద్యం మత్తులో ఫూల్‌బాగ్‌లో మంగళవారం ఉదయం మంద నర్సింహతో గొడవపడి అసభ్యపదజాలంతో దూషిస్తూ అతని మోకాలిపై తన్ని గాయపరిచాడు. నర్సింహ మనువరాలు అడ్డుకోబోతే ఆమెనూ దూషించాడు. నర్సింహ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని సికింద్రాబాద్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి

అంబర్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన న్యూపటేల్‌నగర్‌లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని సూచించారు.

సమాజంలో మహిళలకు సరైన ప్రాతినిథ్యం

చిక్కడపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళలకు సమాజంలో సరైన ప్రాతినిథ్యం లభిస్తోందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా.అనంత లక్ష్మి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, అరుంధతి వనితా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో భారతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దూరదర్శన్ డైరెక్టర్ కొల్లాపుర కామేశ్వరి, ప్రముఖ గైనకాలజిస్ట్ డా.సూరి శ్రీమతి తదితర వివిధ రంగాల ప్రముఖ మహిళలను అవార్డులు, బిరుదులతో సత్కరించారు. అరుంధతి వనితా వేదిక అధ్యక్షురాలు, కార్యక్రమ నిర్వహణ ప్రముఖులు జయ వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దూరదర్శన్ విశ్రాంత అధికారి విజయదుర్గ, కంజ్యూమర్ యాక్టివిస్ట్ వింజమూరు కల్యాణి, శ్రీవాణి, రమాప్రభ, చెరుపు జ్యోత్స్న, శంకర అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): యువత ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో విశ్లేషణాత్మక ప్రసంగ కార్యక్రమాన్ని మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

అంబర్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తొలగించారు. జైస్వాల్‌గార్డెన్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి, ఆక్రమణలను తొలగించారు.

అనధికారిక మెడికల్ దుకాణాలు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి : ఏఐవైఎఫ్

నల్లకుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అనధికారికంగా కొనసాగుతున్న మెడికల్ దుకాణాలు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ.కమలాసన్‌రెడ్డికి మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్‌వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధర్మేంద్ర హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అనుమతి లేని మెడికల్ దుకాణాలు, క్లినిక్‌లో నాసిరకం మందులు, యాంటీ బయోటిక్స్ ఇంజక్షన్‌లను విక్రయిస్తున్నారని ఆరోపించారు.



ఆహారం గిన్నెలతో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థుల ధర్నా

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో సరైన ఆహారం పెట్టడం లేదని నిజాం కళాశాల విద్యార్థులు మంగళవారం రోడ్డెక్కారు. బషీర్‌బాగ్‌లోని హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి మంచి ఆహారం అందించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. రోడ్డుపైనే అన్నం, కూరలు పెట్టుకుని ధర్నా చేశారు. హాస్టల్ గేటు ఎదుట నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినదించారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సైఫాబాద్ పోలీసులకు విద్యార్థులకు తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేశారు.

మల్లికార్జున్ నియామకంపై హర్షం

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కురివి శ్రీవీరభద్రస్వామి భద్రకాళి ఆలయ ధర్మకర్తగా కాసుల మల్లికార్జున్‌ను నియమించడం నగరానికే గర్వకారణమని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కొండూరి వినోద్‌కుమార్, సామాజిక న్యాయ గ్రామీణాభివృద్ధి న్యాయవాదుల సంఘం కార్యదర్శి వినోద్, బీజేపీ నగర నాయకుడు ఆనంద్‌కుమార్, విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ చిత్తరంజన్ రావు కొనియాడారు. మంగళవారం కాచిగూడలో మల్లికార్జున్‌ను శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి

ఎమ్మెల్యే గోపాల్



సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శలు ఎంతగానో దోహదం చేస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ భాగ్యలక్ష్మీనగర్‌లో ఉన్న ఓ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను ఎమ్మెల్యే గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన అనేక ఎగ్జిబిట్‌లను ఎమ్మెల్యే తిలకించారు.

మంచినీరు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తా

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని దయానంద్‌నగర్‌లో మంచినీరు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బస్తీవాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం దయానంద్ నగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మహిళలు బస్తీలో మంచినీరు, డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జల మండలి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు 'జీహెచ్‌ఎంసీ' ఎదుట ధర్నా

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్రేటర్ హైదరాబాద్‌లో బిల్డింగ్ రెగ్యులైజేషన్ (బీఆర్‌ఎస్), ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఎలాంటి చెల్లింపులూ లేకుండా ఫైళ్లకు అనుమతి హామీని నెరవేర్చాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు.

పనులను పూర్తి చేయండి : ఎమ్మెల్యే



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

గోల్నాక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఇప్పటికే పనులను ప్రారంభించి, మొదలు పెట్టిన మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జల మండలి అధికారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మంగళవారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో కొనసాగుతున్న పనుల పురోగతిపై చర్చించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కుటుంబ ఆధారిత వృత్తుల బలోపేతమే 'విశ్వకర్మ యోజన' లక్ష్యం

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే పీఎం విశ్వకర్మ యోజన పథకం లక్ష్యం అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన స్కీమ్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చిక్కడపల్లిలోని డివిజన్ వార్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ ప్రక్రియను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నేతలు నర్సింహ, రఘుయాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ కోసం ఐఎల్‌పీ వనరుల అభివృద్ధి

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇండియా లిటరసీ ప్రాజెక్ట్(ఐఎల్‌పీ) సుమారు 33 సంవత్సరాల కిందట ప్రారంభమై ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉత్తమపౌరులుగా తయారు చేయాలన్న ఉద్దేశంతో వివిధ తరగతులలో పిల్లలకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే వనరులను అభివృద్ధి చేసిందని ప్రాజెక్ట్ కెరీర్‌గైడ్‌లు సౌమ్య, సోనుకుమార్, కిషోర్ తెలిపారు. కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించామని చెప్పారు. 93848 80336 వాట్సాప్ నెంబర్ ద్వారా స్పష్టమైన సమాచారం వస్తుందన్నారు. స్కాలర్‌షిప్ పొందడానికి కెరీర్ గైడెన్స్ కోసం హెల్ప్‌లైన్ 7416863830 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ఛత్రపతి శివాజీ జయంతి రోజు సెలవు ఇవ్వాలి'

నల్లకుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజు నేషనల్ హాలిడే ప్రకటించాలని దేశంలోని అన్ని రాష్ట్రాలలో తమ ఉద్యమం కొనసాగుతుందని శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ.చవాన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలోపు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజు నేషనల్ హాలిడే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓబీసీ కుల సంఘాల సామాజిక సమ్మేళనం నేడు

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కుల సంఘాల సామాజిక సమ్మేళనం బుధవారం జరుగుతుందని అంబర్‌పేట ఓబీసీ మోర్చా కన్వీనర్ ఎస్.వెంకటస్వామిగౌడ్ తెలిపారు. అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో సాయంత్రం 6 గంటలకు సామాజిక సమ్మేళనం జరుగుతుందని తెలిపారు.



శేషులతను సన్మానిస్తున్న మధుసూదనరావు, కృష్ణ

నిత్య సంగీత శ్రామికురాలు శేషులత

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నిత్య సంగీత శ్రామికురాలు శేషులత అని ప్రముఖులు పేర్కొన్నారు. రాగరాగిణి మహిళా సాహితీ, సాంస్కృతిక, సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో సంగీత విద్వాన్ డా.శేషులత త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠి మధురంగా జరిగింది. ముఖ్యఅతిథిగా దూరదర్శన్ మాజీ డైరెక్టర్ డా.పాలకుర్తి మధుసూదనరావు, సభాధ్యక్షులుగా గేయరచయిత డా.వడ్డేపల్లి కృష్ణ పాల్గొని శేషులతను సన్మానించారు. సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవీ.రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

- రాగసప్తస్వరమ్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని వివిధ కళాప్రదర్శనలతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సివిల్ సర్వీస్ అధ్యాపకురాలు సర్వమంగళగౌరి హాజరయ్యారు. సంస్థ స్థాపకురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అహల్య, నమిత తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సరం సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఉగాది జాతీయ నంది పురస్కారాలు, తెలుగు తేజం, తెలంగాణ తేజం పురస్కారాలను ప్రదానం చేయనుంది. ఏప్రిల్ 29న న్యూఢిల్లీలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విభిన్న రంగాల వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని స్థాపక కార్యదర్శి జి.కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 15లోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునని మరిన్ని వివరాలకు జి.కృష్ణ 9494523562 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కులగణనకు జీవో జారీ చేయాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే కులగణనకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ప్రభుత్వం కాలయాపన చేయవద్దని అన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా అజయ్‌కుమార్

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా ఎడెల్లి అజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం మంగళవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అజయ్‌కుమార్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌పై కమలం జెండా ఎగిరి తీరుతుందన్నారు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా బలదేవరెడ్డి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా కందాల బలదేవరెడ్డి నూతనంగా నియమితులయ్యారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బలదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించి అన్ని సౌకర్యాలూ కల్పించాలని కోరారు.

'వారేమీ చట్టాలకు అతీతులు కారు' తీర్పుపై హర్షం

కవాడిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చట్టాలకు దేశంలోని పార్లమెంట్, విధాన, శాసనసభల సభ్యులు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105, 194లకు పూర్తి విరుద్ధమని, వారేమీ చట్టాలకు అతీతులు కారని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం అభినందనీయం అని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కవాడిగూడలోని అడ్వకేట్‌జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అవినీతికి పాల్పడే ఎంపీలు, ఎమ్మెల్యేలను విచారించాల్సిందేనని స్పష్టం చేయడం హర్షణీయమన్నారు.

గో గీత లఘు చిత్ర ప్రదర్శన

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గోమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఎక్సైజ్‌కాలనీలోని శ్రీసాయిబాబా మందిరంలో డాక్టర్ నిట్టల గోపాలకృష్ణతో గో గీత లఘు చిత్రప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ముదిగొండ శివప్రసాద్ హాజరయ్యారు. ఎరా కాలేజీ ప్రిన్సిపాల్ భాష్యం శ్రావణ్‌కుమార్, శెనిశెట్టి రాజమౌళిగుప్తా, బాలకృష్ణస్వామి, కె.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలోని ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు.